## ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

**కళ్యాణదుర్గం, మే 11, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు గోపికృష్ణ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం తాలూకా నూతన కార్యవర్గం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా కళ్యాణదుర్గం తాలూకా అధ్యక్షునిగా నాగరాజు ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిదంగా సెక్రటరీగా గణేష్, ట్రెజరర్ గా నవీన్ రెడ్డి,అసోసియేట్ ప్రెసిడెంట్ గా డి శ్రీనివాసులు ఎస్ టి ఓ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ గా రమేష్ బాబు,దివ్య శిల్ప, సూరాంజనేయులు,రాధా, డాక్టర్ సాయి చరణ్,వెంకన్న, జాయింట్ సెక్రటరీలుగా శివకుమార్, ఉపేంద్ర,డాక్టర్ అస్మా, దేవరాజు, నాగభూషణం, అశోక్ కుమార్, అనసూయమ్మ లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవవడం జరిగిందని వాడు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తమవంతు కృషి చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డిఏ బకాయిలు, ఐ ఆర్ పిఆర్ సి కమిటీని త్వరితగతిన ఏర్పాటు చేసే విధంగా ఒత్తిడి తెస్తామని,అలాగే సచివాలయ ఉద్యోగుల ప్రధాన సమస్యలైన ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయడం, సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ను వర్తింపజేయడం, సచివాలయ ఉద్యోగుల భవిష్యత్తును కాలరాసే జీ ఓ నెం. 523 ను రద్దు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి రాము నాయక్ గారు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి వేణుగోపాల్ గారు, జిల్లా కార్యదర్శి నాగరాజు గారు, జిల్లా జాయింట్ సెక్రెటరీ వరప్రసాద్ గారు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మండల సర్వ సభ్య సమావేశంకు అందరూ హాజరు కండి

**- ఎంపిడిఓ నంద కిషోర్**

**బ్రహ్మసముద్రం మే 11 ప్రభాతవార్త**

బ్రహ్మ సముద్రం మండల కేంద్రం నందు మండల పరిషత్ కార్యాలయం నందు 13. 05.25 మంగళ వారం ఉదయం11. 30.గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించ డం జరుగుతుందని కావున ఈ సమావేశమునకు మండల పరిధిలోని సర్పంచులు.ప్రాదేశిక సభ్యులు .ఎంపిపి.జడ్ పి టి సి. అన్ని శాఖలకు చెందినంప్రభుత్వ అధికారులు తప్పక హాజరై మండల పరిధిలో గల సమస్యలను చర్చించి తీర్మానించి అభివృద్ధికి తోడ్పడాలని ఎంపి డి ఓ నందకిషోర్ పత్రికా ముఖంగా తెలియజేశారు.

## తాగునీటి కోసం పల్లెల ప్రజల ఎదురుచూపు

**శ్రీరామిరెడ్డి నీటి వర్కర్ల సమస్య తీరేదెన్నడు.?**

**బ్రహ్మ సముద్రం మే 11 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండల పరిధిలోని శ్రీరామిరెడ్డి నీటి సరఫరా వర్కర్లు తమకు జీతాలు ఇవ్వక పోవడంతో 32 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తూ గ్రామాలయందు త్రాగునీరు సరఫరా చేయక బంద్ చేయడం జరిగింది. అసలే ఎండాకాలం మే నెలలో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయి ప్రజ్లలకు గ్రామాల యందు త్రాగు నీరు అందక సతమత మవుతున్న ప్రభు త్వ అధికారులు స్పందించక పోవడంతో కార్మికులు ససేమీరా అంటూ భీష్మించుకున్నారు. ప్రభుత్వ అధికారులు గాని ఇటు పాలకులు గానీ వీరి సమస్యను పరిష్కరించి న పాపానపోలేదు ప్రతి సంవత్సరం ఇలాగే రెండు మూడు సార్లు వీరికి జీతాలు పంపిణీ చేయకపోవడంతో తప్పనిసరిగా సమ్మె చేయాల్సి వస్తుంది కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల యొక్క సమస్యలు తీర్చి గ్రామాల యందు గల ప్రజల యొక్క త్రాగునీటి సమస్యలను తీర్చాలని బ్రహ్మసముద్రం మండల ప్రజలు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత కత్నకు భారీ స్పందన

**కనేకల్లు ప్రభాతవార్త మే 11**

కనేకల్ పట్టణంలో ఎస్ ఎస్ బి హెల్త్ కేర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కత్న కార్యక్రమం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ ఖాత్న ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా అనంతపురం గఫూర్ హాస్పిటల్ డాక్టర్ గఫూర్ సబ్ మరియు డాక్టర్ అరోహి, చైర్మన్ షాకీర్ కనేకల్ పట్టణ ప్రముఖులు షేక్ ఫక్రుద్దీన్ మాజీ సర్పంచ్,డాక్టర్ నేమతుల్లా ఖాద్రీ డాక్టర్ హనీఫ్ , హఫీజ్ ఖాజీమ్ భాషా సాహెబ్ ఇచ్చేశారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. షేక్ గౌస్ సబ్, పీర్ భాష , ఫజులుద్దీన్ ఆసిఫ్, నబి రసూల్ పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ లో పాల్గొన్న కాలువ భరత్

**కనేకల్లు ప్రభాతవార్త మే 11**

కనేకల్ మండల పరిధిలోని మాల్యం గ్రామం నందు శరభన గౌడ కూతురు వివాహ రిసెప్షన్ వేడుకలు ఆదివారం ప్రభుత్వ విప్పు రాయదుర్గం శాసనసభ్యులు కాల్వ శ్రీనివాసులు కుమారుడు కాలవ భరత్ పాల్గొని నూతన మాధవలను ఆశీర్వదించారు. మూడుముళ్లతో ఏకమైన ఈ బంధం కలకాలం అన్యోన్యంగా వర్ధిల్లాలని ఒకరికొకరు ఆదర్శంగా ఉంటూ జీవనం ప్రారంభించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శరబన్న గౌడ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ ఆనందరాజులు కన్వీనర్ లాలెప్ప చెరువు సంఘం అధ్యక్షులు బిటి రమేష్ మాజీ అధ్యక్షులు మిల్లు చంద్రశేఖర్ గుప్తా కవిట్టు మాబు చాంద్ భాష విజయ్ కుమార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

## జవాన్ మురళి నాయక్ సేవలను ప్రతి ఒక్కరు గుర్తు ఉంచుకోవాలి

**క్లస్టర్ ఇంచార్జ్ ఆనంద రాజులు**

**కనేకల్లు ప్రభాతవార్త మే 11**

భారతదేశ కోసం ప్రాణాలు అర్పించిన గోరంట్ల మండలం తల్లి తాండకు చెందిన మురళి నాయక్ త్యాగం ను మనమందరం మరువలేమని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ ఆనందరాజులు అన్నారు.మురళి నాయక్ మన భారతదేశం కోసం తను చేసిన త్యాగం ఎన్నటికీ మరువలేమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. బాధిత తల్లిదండ్రులకు మనం అందరం ధైర్యం చెప్పాలని పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలు ప్రతి భారతీయుడు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మన వీర జవాన్లకు ప్రతి ఒక్కరు మద్దతుగా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. మనకోసం అక్కడ ఎందరో జవాన్లు దేశాన్ని రక్షిచేందుకు ప్రాణాలను పణంగా పెడుతున్నారు అలాంటి వారందరి కోసం మన భారతదేశం లో ఉన్న వారు అంతా వారికి రుణపడి ఉండాలని తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కనేకల్లు ప్రభాతవార్త మే 11**

కనేకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల ఉన్నత పాఠశాల నందు 2004 2005 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పూర్వ విద్యార్థులందరూ ఒకచోట కలిసి పండుగల జరుపుకున్నారు. వారికి పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు పూర్వ విద్యార్థుల ఆత్మసంబంధన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు.



## అగ్నివీరుడు మురళి నాయక్‌కు జోహార్లు

**త్యాగధనుడి సేవలతో భారతావణి పునీతమైంది**

**ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**



నివాళులు అర్పిస్తున్న కాలవ శ్రీనివాసులు

**రాయదుర్గం ప్రభాతవార్త మే 11**

యుక్త వయసులో దేశసేవలో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ సేవలతో భారతావణి పునీతమైందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కొనియాడారు. పాకిస్థాన్ యుద్ధంలో ప్రాణాలు వదిలిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కలితాండాకు చెందిన మురళీనాయక్ భౌతికకాయాన్ని శనివారం రాత్రి ఆయన స్వగ్రామానికి తరలించారు. ఆదివారం ఆయన భౌతికకాయానికి పూల మాలవేసి కాలవ ఘన నివాళి సమర్పించారు. ఆ కుటుంబానికి తన వంతుగా రు.50వేల ఆర్థిక సాయం అందచేశారు. ఎన్డిఏ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటుందని రాయదుర్గంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ కాలవ పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబులు ఘన వీడ్కోలు పలికారన్నారు. నారా లోకేష్ స్వయన అంతిమ యాత్రలో పాల్గొని పాడిమోయటం చాలా బాధ్యతతో కూడుకున్నదన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన మురళి చిన్నాప్పటి నుండే దేశసేవలో పాల్గొనాలని ఎంతగానో పరితపించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. భరతమాత శ్రేయస్సు, రక్షణ కోసం ప్రాణ త్యాగం చేయటం అజరామరమ్మన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకోటానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. కుమారుడి మరణ బాధ నుండి ఆ కుటుంబం త్వరగా కోలుకునేలా ఆ భగవంతుడు ఆశీసులు అందచేయాలని కోరుకొంటునానన్నారు

## బుద్ధ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభం



పిరమిడ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కంబదూరు, మే 11, ప్రభాతవార్త**

కంబదూరు మండల పరిధిలోని ఓబగానిపల్లి గ్రామంలో పిరమిడ్ మాస్టర్ అశ్వత నిర్మించిన నూతన బుద్ధ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం అనంతపురం పిరమిడ్ మాస్టర్స్ విజయ్ కుమార్, చంద్రశేఖర్ లు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం వారు మాట్లాడుతూ బ్రహ్మశ్రీ సుభాష్ పత్రి తెలియజేసిన విద్యను ప్రజలకు వివరించారు. శ్వాస మీద ధ్యాస ఉంచితే ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికంగా ముందుకెళ్లవచ్చని సందేశాన్ని ఇచ్చారు.నమ్మకం ఉంచి ఏ పని చేసినా అది నెరవేరుతుందని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని వివరించారు .మరికొంతమంది బ్రహ్మంగారు తత్వాలు వేమన గారి తత్వాలు వివరిస్తూ జ్ఞానం తెలియజేశారు. ఈ కార్యక్రమంలోని నియోజకవర్గ పిరమిడ్ మాస్టర్ ఫక్రుద్దీన్ , కుందుర్పి పిరమిడ్ మాస్టర్స్ సురేష్ కంబదూరు పిరమిడ్ మాస్టర్ హరి తిమ్మాపురం, కళ్యాణ్ దుర్గం పిరమిడ్ మాస్టర్స్ పాల్గొన్నారు.

## సమ్మె జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

**బెలుగుప్ప, మే 11 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో ఆదివారం సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి మే 20వ తేది దేశ వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సమ్మె చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలన్నీ నెరవేరుస్తున్నారు. మన రాష్ట్రంలో లేకుండా చేస్తున్నారని, అందులో భాగంగా లేబర్ కోడ్‌లకు సంబంధించి, భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించిన కోడ్స్‌ను బంద్ చేస్తున్నారని అందుకోసమే ఈ నెల 20వ తేదిన అనంతపురంలో ఈ సమ్మెల్యేకు అధిక సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల భవన నిర్మాణ శాఖ కార్యదర్శి అశోక్, భీమన్న, మారెన్న, వెంకటేషులు, ఎరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరునికి వైకాపా ఘన నివాళులు



నివాళులు అర్పించిన దృశ్యం

**గుత్తి, మే 11 ప్రభాతవార్త**

దేశ రక్షణకు తన ప్రాణాలను అడ్డుపెట్టి అమరుడైన జవాన్ మురళి నాయక్ కు ఆదివారం వైకాపా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు హుస్సేన్ పీరా, రాష్ట్ర నాయకులు సి వి రంగారెడ్డి, ప్రసాద్ యాదవ్, రంగస్వామి, బింగి బాబు, మల్లికార్జున, రామాంజి, వెల్డింగ్ రౌఫ్, అబ్దుల్, పవన్, సునీల్, రాజేష్ రాజశేఖర్ రెడ్డి ,సుధీర్ రెడ్డి, పుల్లారెడ్డి, కౌన్సిలర్,శివ పాల్గొన్నారు.

## గుత్తి ఆర్ఎస్ లో వ్యక్తి అనుమానస్పద మృతి

**గుత్తి, మే 11 ప్రభాతవార్త**

గుత్తి ఆర్ఎస్ లోని టోల్ షాప్ కాలనీలో అమీర్ భాష (48) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. ఇతను కడప జిల్లా కమలాపురం చెందిన వాడు. గత పదిహేను సంవత్సరాలుగా స్థానికంగా నివసిస్తూ ప్రైవేట్ విద్యుత్ కార్మికుడిగా పనిచేసేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే ఇటీవల భార్యతో విడాకులు తీసుకున్నాడు. శుక్రవారం భోజనం తీసుకుని ఇంటికి వెళ్లగా ఆదివారం మృతి చెంది కాన వచ్చాడు. ఇది ఆత్మహత్యనా లేదా సహజ మరణమా అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



మృతి చెందిన వ్యక్తి

## అధికారిక లాంచనాలతో వీర జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు

**- పటిష్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిన అంత్యక్రియలు.**



నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ వి రత్న

**పుట్టపర్తి రూరల్ మే 10 ప్రభాతవార్త**

పాక్ కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్ అంత్యక్రియలు ఆదివారం ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో, పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య వీర జవాన్ అంతక్రియలు స్వగ్రామమైన కల్లి తండాలో ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర గౌరవం మంత్రులు నారా లోకేష్ ,పవన్ కళ్యాణ్ , హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని ప్రసాద్, సత్య కుమార్ సవితమ్మ , ఎంపీ ,ఎమ్మెల్యేలు పలువురు ఈ అంత్యక్రియల్లో పాల్గొని వీర జవాన్ మురళి నాయక్ నివాళులర్పించారు. జిల్లా పోలీస్ శాఖ మిలటరీ సైనిక బృందం, బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా అంత్యక్రియలు నిర్వహించే వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. అధికారిక లాంచనాల ప్రకారం సైనికులు , పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపి కొద్దిసేపు మోనం పాటించి గౌరవ వందనం చేశారు. అనంతరం మంత్రులు, జిల్లా కలెక్టర్ తోపాట,జిల్లా ఎస్పీ శ్రీమతి వి.రత్న పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది సమన్వయంతో వీర జవాన్ అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిసే విధంగా విధులు నిర్వర్తించారు. ఈ కార్య క్రమం పోలీస్ అధికారులు సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారుల సమన్వ యంతో ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రాంతీయ వర్క్ షాప్ కు తరలిన నేతలు



తరలి వెళ్తున్న నాయకులు

**గుత్తి, మే 11 ప్రభాతవార్త**

జన విజ్ఞాన వేదిక ప్రాంతీయ వర్క్ షాప్ కు హాజరయ్యేందుకు గుత్తికి చెందిన జేవీవి నేతలు ఆదివారం తరలి వెళ్లారు. రాయలసీమ వ్యాప్తంగా కర్నూలు జిల్లా డోన్ లో జరగనున్న ఈ వర్క్ షాప్ లో పలు తీర్మానాలు చేసి ప్రజలలో చైతన్యాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు రామాంజనేయులు, చిట్టెప్ప, రామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

**వజ్రకరూరు మే 11 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీ జనార్ధన వెంకటేశ్వర స్వామి మినీ కళ్యాణమండపంలో ఆదివారంమండలంలోని తట్రకల్లు గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ శివ వివాహ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయనస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహ కార్యక్రమానికి హాజరైన పలువురు నాయకులను ,కార్యకర్తలను, గ్రామస్తులను పలకరించి వారి బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు.

## వైయస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదనడం అర్థరహితం..!

**విలేకరుల సమావేశంలో వైయస్సార్ సీపీ నాయకులు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైయస్సార్ సీపీ నాయకులు

**ఉరవకొండ, మే 11 ప్రభాతవార్త**

గత వైయస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడం అర్థరహితమని వైయస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని వైయస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.బసవరాజు, నెరమెట్ల సర్పంచ్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బి.యోగేంద్ర రెడ్డి, మోపిడి సర్పంచ్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు మేకల సిద్ధప్ప, వైస్ ఎంపీపీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈడిగ ప్రసాద్, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు రాయంపల్లి ఎర్రిస్వామి రెడ్డి, మండల పార్టీ సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, కురుబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కౌడిగి గోవిందు తదితరులు మాట్లాడారు. వై.యస్.జగన్మోహన్ రెడ్డి బటన్లు నొక్కి ఖాతాల్లో డబ్బులు జమ చేశారు గాని అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ముఖ్యమంత్రి, నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి మొత్తం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోని జరిగిందని చెప్పుకు రావడం విస్మయం కలిగిస్తోందన్నారు. వై.యస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో నూతనంగా సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, విలేజ్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసి లక్షలాది మందికి ఇంటి స్థలాలు, ఇల్లు నిర్మించి ఇచ్చారన్నారు. వ్యవసాయ రంగాన్ని ఎంతో ఆదుకున్నారని ఏ సీజన్లో పంట నష్టం జరిగితే ఆ సీజన్లోని రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందించారన్నారు. ఒక్క ఉరవకొండ నియోజకవర్గం లోనే వైయస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 4వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని ఈ విషయమై చర్చించడానికి ఎప్పుడైనా సిద్ధమన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని ఇప్పటివరకు ఉరవకొండ నియోజకవర్గంలో అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలన్నారు. కేవలం ఉపాధి హామీ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తూ కూలీలకు చేరాల్సిన డబ్బులను వారి కడుపులు కొట్టి మళ్లిస్తున్నారన్నారు. దాదాపు ఏడాది కాలంలో ఒక్కొక్క గ్రామ పంచాయతీకు కనీసం 10 లక్షల రూపాయలు కూడా గ్రాంట్ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం దాదాపు ఏడాది పాలనలో రాష్ట్రంలో కొత్తగా ఒక్క సామాజిక భద్రత పింఛన్, ఒక్క పేద కుటుంబానికి పక్కా ఇంటిని మంజూరు చేయలేదని, ప్రజా పంపిణీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఈ సందర్భంగా వారు విమర్శించారు. ఈ సమావేశంలో నింబగల్లు ఎంపీటీసీ ఈశ్వర్ బాబు వైయస్ఆర్సీపీ నాయకులు మోపిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సింహ, చంద్రప్రభ వాహనోత్సవాలు



చంద్రప్రభ వాహనంపై దేవేరులతో కలిసి ఊరేగుతున్న దృశ్యం

**ఉరవకొండ, మే 11 ప్రభాతవార్త**

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం వైశాఖ శుద్ధ చతుర్దశి ఆదివారం శ్రీదేవి భూదేవి సమేతుడైన నృసింహ స్వామి సింహ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగారు. ఉదయం, సాయంత్రం జరిగిన వాహనోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన సింహ, చంద్రప్రభ వాహనాలపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాన్ని నిర్వహించారు. కాగా నృసింహ జయంతి సందర్భంగా ఉదయం లక్ష్మీనరసింహస్వామి వారి మూలవిరాట్ కు సుప్రభాత సేవ మొదలు మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహా మంగళహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండే కాకుండా జిల్లా నలుమూలలు, కర్ణాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని వాహనోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్ బాబు, ఉత్సవ ఉభయ దాతలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం నూతన కమిటీ సభ్యులు

**ఉరవకొండ, మే 11 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెద్ద ముష్టూరు గ్రామంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నూతన గ్రామ కమిటీ ఎన్నికయింది. కమిటీ అధ్యక్షుడిగా బి.కుళ్లాయప్ప, గౌరవాధ్యక్షుడుగా బి. వెంకటేషులు, కార్యదర్శిగా బి.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా ఎం.వెంకటేశులతో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ గొర్రెల కాపరులకు వేసవి కాలంలో సబ్సిడీతో దాణా, మేత, తాగునీటి సౌకర్యం ,తొట్టెలు, బీమా సౌకర్యం, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలన్నారు. జీవాల కొనగోలుకు సబ్సిడీ రుణాలు, కంచెలను ఉచితంగా అందించాలని, గాలికుంటు, బ్లూటంగ్ లాంటి వ్యాధులకు మందులు ,గొర్రెల కాపరులకు ,గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించాలని, గ్రామాలలోని ప్రభుత్వ, చెరువు భూముల్లో పచ్చిక బయల్లు ఏర్పాటుచేసి నీటి తొట్టెలు నిర్మించి తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పెంపకం దారులకోసం సమగ్ర సంక్షేమ చట్టం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుఫాన్ల సమయంలో పిడుగులు పడి ప్రమాదంలో చనిపోయిన జీవాలకు ,కాపుదారుల కుటుంబాలకు ప్రభుత్వమే ఉచితంగా భీమా చెల్లించి పరిహారం అందించాలని, పిల్లలను ఉచితంగా రెసిడెన్షియల్ స్కూల్లో విద్య చెప్పించాలని కోరారు. గొర్రెల కాపరుల రక్షణకు అట్రాసిటీ చట్టం, అడవి జంతువుల నుంచి రక్షణ చట్టం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రాజు, ఎరికల ఆనంద్, చాకలి వన్నూరు, ఎం.నాగరాజు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

**ఉరవకొండ, మే 11 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని వై.రాంపురం గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల పూర్వ సమ్మేళనం కార్యక్రమం సందడిగా జరిగింది. పాఠశాలలో 200304లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 21 సంవత్సరాలు తర్వాత చదువుకున్న పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చదువుకున్న పాఠశాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి మామిడి తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి చదువులతల్లి సరస్వతి పూజ నిర్వహించారు. వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తూ ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ సమ్మేళన కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. పాఠశాలను కలియతిరిగి నాడు తాము చదువును అభ్యసించిన తరగతి గదులు, కూర్చున్న ప్రదేశాలు చూసి సంబరపడ్డారు. చదువుకునే రోజుల్లో గడిపిన ఆనంద క్షణాలు, చేసిన అల్లర్లను గుర్తుకు తెచ్చుకున్నారు. పరిచయ కార్యక్రమం నిర్వహించి ప్రస్తుతం ఎవరెవరు ఎక్కడెక్కడ ఏఏ వృత్తులు, వ్యాపారాల్లో స్థిరపడ్డారో, కుటుంబ వివరాలను ఒకరినొకరు పంచుకున్నారు. తమ ఆహ్వానం మన్నించి కార్యక్రమానికి విచ్చేసిన పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు జానకి, నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గోవిందప్ప, బాలాజీ, అనితబాయి, శ్రీదేవి, వెంకటనాయుడు, గోవర్ధన్ జ్యోతి, లావణ్య, విఠల్, అరుణ్, రోజా రమణిలను ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం అక్కడే విందు భోజనాన్ని ఆరగించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆప్యాయపు పలకరింపులు, అనురాగపు ఆలింగనాలతో ఆనాటి స్మృతులను నెమరేసుకున్నారు. తమ కలయిక జీవితాంతం గుర్తుండిపోయేలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, మిత్రులతో గ్రూప్ ఫోటో దిగారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో కార్య నిర్వాహకులైన పూర్వ విద్యార్థులు మోపిడి తిప్పయ్య, రాజేష్, ఎర్రి స్వామి, వెంకటరెడ్డి, సుందరమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మినరసింహ స్వామి జయంతి

**వజ్రకరూర్ మే 11 ప్రభాతవార్త**

మండలంలోని గంజికుంట గ్రామంలోప్రాచీన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు, ఆకు పూజ, అభిషేకాలు నిర్వహించారు. యుద్ధంలో భారతీయ భారతీయ సైనికులు మృతి చెందకుండా భారత్ విజయం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



స్వామి వారి ఉత్సవమూర్తులకు కళ్యాణం

